క్లుప్తంగా

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం



ఇంటి మంజూరుపత్రం అందిస్తున్న నాయకులు

కొందుర్గు: కాంగ్రెస్ నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ అన్నారు. మండలంలోని శ్రీరంగాపూర్‌లో శుక్రవారం లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి, మంజూరు పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, బాల్‌రాజ్, సురేశ్, సోను, ముజ్జు, గంగయ్య, అశోక్, చంద్రయ్య పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న దాతలు

చేవెళ్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న ఆలయ నిర్మాణానికి దాతలు చేవెళ్లకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, సమత దంపతులు, మాజీ సర్పంచ్ బండారి శైలజ, ఆగిరెడ్డి దంపతులు రూ.30లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు విరాళానికి సంబంధించిన చెక్కును శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం దాతలను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ మండల మాజీ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్



మోహన్‌సింగ్

షాద్‌నగర్: బీజేపీ ఎస్టీ మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మోహన్‌సింగ్ నియామకయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జిగా ఆయనను ఎన్నుకున్నారు. అనంతరం మోహన్‌సింగ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్‌భూపాల్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

షాబాద్: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సతీశ్, శిరీష, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దవేడు, తిర్మలాపూర్ గ్రామాల్లో జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరిలో నారుమడి, నీటి, ఎరువుల యాజమ్యానంపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, మొక్కజొన్న పంటలలో వచ్చే కలుపు, చీడపీడలు, పంట మార్పిడి పద్ధతిని విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశం, ఏఈఓలు రాజేశ్వరి, కిరణ్మయి, రిసెర్చ్ స్కాలర్స్ రాజేందర్, వరుణ్‌కుమార్, అవనిజ, మిలింద్, పరిశోధన విద్యార్థి ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రైతులు తదితరులు ఉన్నారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రమీల

చేవెళ్ల: రైతులు పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని చేవెళ్ల, పామెనలలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి.రమ్య, డాక్టర్ వి.కవిత కిరణ్, డాక్టర్ స్నేహలత, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రమీల ఆయా వార్డుల్లో రైతులకు పంటల సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు పంట మార్పిడి విధానం పాటించాలని తద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయంలో రైతులు సరైన సాగు పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓలు బాలకోటేశ్వర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల రాజేశ్, అపూర్వ, గిరిబాబు ఉన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

వృథాగా డబుల్ బెడ్రూం ఇళ్లు

- లబ్ధిదారులను ఎంపిక చేసినా కేటాయింపులో జాప్యం
- పట్టించుకోని అధికారులు



నందిగామలో వృథాగా ఉన్న డబుల్ ఇళ్లు

నందిగామ: డబుల్ బెడ్రూం ఇళ్ల జాబితాలో లబ్ధిదారులను ఎంపిక చేశారు.. లక్కీ డ్రాలో గదుల నంబరును కేటాయించారు.. త్వరలోనే సొంతింటి కల నెరవేరబోతుందని వారందరూ సంబురపడ్డారు.. కానీ రెండేళ్లు గడుస్తున్నా కూడా నేటివరకు ఇళ్లు కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన నందిగామలో నిర్మించిన డబుల్ ఇళ్ల పరిస్థితి ఇదీ.

120 ఇళ్ల నిర్మాణాలు..

నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండల కేంద్రమైన నందిగామలో పాత జాతీయ రహదారి పక్కన సర్వే నం.1414లో సుమారు 1 ఎకరా 19 గుంటల్లో టీఎస్‌హెచ్‌సీఎల్-పీఎంఏవై నిధులు రూ.6 కోట్ల 4లక్షల 80వేలతో 4 బ్లాక్‌లలో 120 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. ఇళ్ల కోసం 429 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో నుంచి 21 మంది డబుల్ ఎంట్రీ చేశారని అధికారులు అప్పట్లో వారి పేర్లను తొలగించారు. మిగతా 408 మంది దరఖాస్తుదారులలో అధికారులు సమగ్ర విచారణ జరిపి 120 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారిలో 100 మందికి 2023 మే 4వ తేదీన లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి నంబర్లను కేటాయించారు. మిగతా 20 మంది లబ్ధిదారులకు దరఖాస్తులను పునః పరిశీలిస్తామని అప్పట్లో అధికారులు తెలిపారు.

హడావిడిగా ప్రారంభించి..

ఎన్నికలకు ముందు కోడ్ వస్తుందనే పుకార్ల నేపథ్యంలో 2023 అక్టోబర్ 5న అప్పటి మంత్రి కేటీఆర్ షాద్‌నగర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే సమయంలో నందిగామలో డబుల్ బెడ్రూం ఇళ్ల శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఇళ్ల కేటాయింపు నిలిపివేయడంతో ఇళ్లు వృథాగా మారాయి.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు..

డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్లకు గురైన అధికారులు కొంత మంది అనర్హులకు ఇళ్లు కేటాయించారని, దీంతో అర్హులు అన్యాయానికి గురవుతున్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇళ్లు వచ్చిన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. నిరుపేదలమైన తమకు కనీస గూడు లేకపోవడంతో డబుల్ బెడ్రూం ఇళ్లు వస్తాయని ఆశతో ఎదురుచూశామని, లక్కీ డ్రాలో తమకు ఇళ్లు కేటాయించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఇళ్లు స్వాధీనం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా ఇళ్లు..

డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి సుమారు రెండున్నర ఏళ్లు కావొస్తున్నా నేటివరకు వృథాగానే ఉన్నాయి. దీంతో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరడమే కాకుండా పరిసర ప్రాంతాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా అసాంఘీక కార్యకలాపాలు సైతం చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీలైనంత తొందరగా ఇళ్లు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



లక్కీ డ్రాలో తమ పేరును తీసి రెండేళ్లు గడుస్తున్నా నేటి వరకు ఇళ్లు ఇవ్వడం లేదు. కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాం. అక్కడ డబుల్ బెడ్రూం ఇళ్లు వృథాగా ఉన్నాయి. తాము ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇళ్లు అప్పగించాలి.

–పబ్బతి కలమ్మ, నందిగామ

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల రాగానే..



డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ఉన్నతాధికారుల ఆదేశానుసారం జరుగుతుంది. పైనుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. గతంలో ఎంపిక చేసిన వారికి ఇవ్వాలా.. లేక మళ్లీ లబ్ధిదారులను ఎంపిక చేయాలా అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

–రాజేశ్వర్, తహసీల్దార్

పరిసరాల శుభ్రత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ బాలాజీ



పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ బాలాజీ, సిబ్బంది

కొత్తూరు: వర్షాకాలంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ కోరారు. పట్టణంలో పలువురు కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి ఆయన ఒక మార్పు- అభివృద్ధికి మలుపు అనే నినాదంతో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే సిబ్బంది అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా ప్రజలు, వ్యాపారులు తడి, పొడి చెత్తను వేరుగా సిబ్బందికి ఇవ్వాలని కోరారు. రోడ్లు, ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తను వేయొద్దని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో వ్యాపారులు, ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టే పలు కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అన్ని కార్యక్రమాలను షెడ్యూల్ వారీగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, బాబులాల్, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

చేవెళ్ల: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న వ్యాపారాన్ని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.రాజేశ్ అన్నారు. పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పూర్ణచందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపారమే ధ్యేయంగా పాఠశాలల్లో బుక్స్, బ్యాగులు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి ట్రేడింగ్ లైసెన్స్‌లు లేకుండానే నోట్ పుస్తకాలు అమ్ముతూ బిల్స్ ఇవ్వకుండానే వ్యాపారం చేస్తున్నారన్నారు. వీటిపై అధికారులు తనిఖీలు నిర్వహించి ఇలా ప్రైవేటు వ్యాపార దందాను కొనసాగిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు న్యాలట అశోక్, బొజ్జి శ్రీకాంత్ ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న విశాల

కేశంపేట: ఉన్నత చదువుతోనే ప్రతీ ఒక్కరికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య, నోట్‌పుస్తకాల పంపిణీతో పాటుగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠ్య, నోటు పుస్తకాలు అందించారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విశాలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, కేశంపేట క్లస్టర్ హెచ్‌ఎం విద్యావతి, ఐసీడీఎస్ కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ మనోహర్



అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సక్కుబాయి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వం కల్పిస్తు న్న సౌకర్యాలను దల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీశైలం, మా జీ వార్డు సభ్యుడు బుడ్డ నర్సింహ, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థికంగా నష్టపోవద్దు



కొత్తూరు: స్టేషన్ తిమ్మాపూర్ పాఠశాలలో విద్యార్థిని చేర్పిస్తున్న తల్లిదండ్రులు

కొత్తూరు: ప్రైవేట్ బడుల్లో చేర్పించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోవద్దని ఎంఈఓ అంగూర్‌నాయక్ కోరారు. మండలంలో గతేడాది మూతబడిన ఎల్‌ఆర్‌కేతండా, స్టేషన్‌తిమ్మాపూర్, అక్కివానిగూడల్లోని పాఠశాలల్లో ఆయన తల్లిదండ్రులతో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలను తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులను సర్కారు బడుల్లో చేర్పించి వాటిని కాపాడుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెంజర్లలో..

మండలంలోని పెంజర్లలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ, ఉపాధ్యాయులు విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, నాయకులు దామోదర్‌రెడ్డి, భీమయ్య, సత్తయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 3 నుంచి 5ఏళ్ల లోపు పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రీ స్కూల్ విద్య అనేది పిల్లలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఆటాపాటలతో విద్యాబోధన, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీణ, అంగన్‌వాడీ టీచర్లు శివలీల, స్వర్ణలత, ఆయాలు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు

జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత

మొయినాబాద్‌రూరల్: రైతులు పంటల సాగులో మెలకువలు పాటించినప్పుడే మంచి దిగుబడులు సాధిస్తారని జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవీలత, డాక్టర్ లీలారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సజ్జన్‌పల్లిలో మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు పాటించినప్పుడే అధిక లాభాలు పొందుతారన్నారు. భూసార పరీక్షలు, పంట మార్పిడి, రసాయన ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాగు ఖర్చు తగ్గించడానికి వరి పంటలో సమగ్ర పోషక, నీటి, చీడపీడలో యాజమాన్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, రైతులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో గ్రేడ్-1 గ్రంథాలయానికి ఆయన రూ.25వేల విలువ చేసే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనకు తెలియని అనేక విషయాలను పుస్తక పఠనంతో తెలుసుకోవచ్చన్నారు. మంచి పుస్తకాలు మన ఆలోచనలను పెంచడంతో పాటు సమాజ మార్పుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. నేటి యువత పుస్తక పఠనాన్ని వదిలేసి స్మార్ట్ ఫోన్ మోజులో పడుతున్నారని, పుస్తకాలు చదవడంతో విజ్ఞానం పెంపొందడంతో పాటు ఆలోచన శక్తి మెరుగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, రాష్ట్ర గిరిజన విభాగం కో–ఆర్డినేటర్ రఘునాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మొక్కలు నాటుతున్న కేఎస్ రత్నం, నాయకులు

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తోల్‌కట్టలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా వారు నాయకులతో కలిసి పొలాల గట్లపై మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాల సూచించారు. మొక్కతోనే మానవుడి మనుగడ సాధ్యమతువుతుందని, తగ్గుతున్న అడవులను నరికి వేయకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండె గణేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మాధవరెడ్డి, వెంకటేశ్, జిల్లా ఓబీసీ కార్యదర్శి ఎలిగని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన యువకులు మాజీ వార్డు సభ్యుడు కనకమామిడి మల్లేశ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ కండువా కప్పి ఆహ్వానించారు.

అప్పోజీగూడలో..

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని అప్పోజీగూడలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం–పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికసించని రాజీవ్ యువ వికాసం

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేశ్



మాట్లాడుతున్న మహేశ్

కేశంపేట: రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలో నిర్లక్ష్యం చేయడం సరికాదని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్‌లో లబ్ధిదారుల ఎంపిక పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. వెంటనే దరఖాస్తులు చేసుకున్నప్రతీ ఒక్కరికి ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే బీజేపీ ప్రజలతో కలిసి ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, కల్వకోల్ తిరుపతి, పర్వతాలు, వీరేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని చిలుకూరు సెక్షన్ పరిధి 33/11కేవీ రెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చందానగర్, కుత్‌బుద్దీన్‌గూడ, ఎల్కగూడ, చిన్నమంగళారం, అప్పోజిగూడ, వెస్ట్‌సైడ్ ఫామ్ గ్రామాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల, పోమాల్‌పల్లిలో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం అల్వాలలో 14 అర్జీలు, పోమాల్‌పల్లిలో 15 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ అజాం అలీ తెలిపారు. కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్‌ఐలు చెన్నకేశవులు, నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యల పరిష్కారం

షాబాద్: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి, పెద్దవేడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్‌రూరల్: భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, శ్రీకాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో వసతులపై వివరించాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎం నాగేశ్

షాద్‌నగర్‌రూరల్: సర్కారు బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సులోచన ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను మహిళా సంఘాల సభ్యులు తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. మీరందరూ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు పంపించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం ఏపీఎం నాగేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రంగయ్య, శ్రీదర్‌రెడ్డి, వెంకటయ్య, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.